సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం । 14 । జూలై । 2023



చీనీ @ రూ.20 వేలు

చీనీ ధర నేలచూపుచూస్తోంది. అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం టన్ను కాయలు గరిష్టంగా రూ.20 వేలు పలికాయి.



'క్యాంపస్'లో కోర్సుల కోత

జేఎన్‌టీయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో కొత్త కోర్సుల అమలుకు నిరాకరణ ఎదురవుతోంది. IIలో

గరిష్టం/కనిష్టం
35.9°/22.3°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం తగ్గింది. ఉక్కపోత పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

- డీఎంహెచ్‌ఓ ఎస్వీ కృష్ణారెడ్డి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి

పుట్టపర్తి అర్బన్: సీజనల్ వ్యాధులతో ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలని డీఎంహెచ్‌ఓ ఎస్వీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం పుట్టపర్తి మండలంలోని నిడిమామిడి, కొట్లపల్లి, సూరగానిపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. విద్యార్థుల్లో ఎవరైనా అనీమియాతో బాధపడుతున్నారా? జ్వర పీడితులు ఉన్నారా? అని పరీక్షించారు. పలువురు విద్యార్థులకు ఐరన్ మాత్రలను అందజేశారు. ముఖ్యంగా చిన్నారులు భోజనం చేసే ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. ఆహారంతో పాటు వ్యాయామం చాలా ముఖ్యమన్నారు. అనంతరం విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. డీఎంహెచ్‌ఓ వెంట సీహెచ్‌ఓ నగేష్, సబ్ యూనిట్ అధికారి రమణయ్య తదితరులున్నారు.

అరిసికెరకు ప్రత్యేక రైళ్లు



గుంతకల్లు: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా అరిసికెరకు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్–అరిసికెర (07231/32) మధ్య ప్రత్యేక రైళ్లు ఈ నెల 20 నుంచి సెప్టెంబర్ 29వతేదీ వరకు రాకపోకలు సాగిస్తాయని వెల్లడించారు. సికింద్రాబాద్ జంక్షన్‌లో (07231) ప్రతి గురువారం రాత్రి 8.00 గంటలకు బయలుదేరి మరుసటి రోజు శుక్రవారం అరిసికెరకు మధ్యాహ్నం 1.00 గంటలకు చేరుతుంది. తిరిగి అరిసికెర జంక్షన్ (07231) నుంచి మధ్యాహ్నం 2.00 గంటలకు బయలుదేరి మరుసటిరోజు శనివారం ఉదయం 8.30 గంటలకు చేరుతుందని తెలిపారు. కాచిగూడ, ఉందానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల్, కర్నూలు, డోన్, అనంతపురం, ధర్మవరం, హిందూపురం, యలహంక, తుమకూరు మీదుగా ప్రయాణిస్తాయని వివరించారు.

జీవనోపాధులపై అవగాహన



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ నరసయ్య

బత్తలపల్లి: మహిళా సంఘాల సభ్యుల ఆదాయ మార్గాలు, జీవనోపాధులపై అవగాహన పెంపొందించుకోవాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ నరసయ్య మహిళలకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని భారతి మండల సమాఖ్య కార్యాలయంలో పది మోడల్ మండలాలకు విజన్ బిల్డింగ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ నరసయ్య, జీవనోపాధుల డీపీఎం రామ్మోహన్ మాట్లాడుతూ గ్రామంలో సంఘాల సభ్యులకు ఆరోగ్యం, విద్య, ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలు, జీవనోపాధులు మొదలగు అంశాలపై శిక్షణ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ రామేశ్వరరెడ్డి, ఏపీఎం సుదర్శన్‌రాజు, ట్రైనర్ భారతమ్మతో పాటు పది మండలాలకు చెందిన ఏపీఎంలు, బత్తలపల్లి మండల సమాఖ్య సీసీలు తదితరులు పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళా



పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి జాబ్‌మేళా ప్రారంభమవుతుందన్నారు. 10వ తరగతి ఆపై ఉన్నత చదువులు చదివిన నిరుద్యోగ యువతీ యువకులు ఇంటర్వ్యూల్లో పాల్గొనవచ్చని సూచించారు. మార్కుల జాబితాలు, ఆధార్, ఫొటోలతో ఇంటర్వ్యూల్లో పాల్గొనాలన్నారు. వివరాల కోసం 9390176421, 9182288465 నంబర్లను సంప్రదించాలన్నారు.



టమాట .. దిగిరాదంట !

అనంతపురం అగ్రికల్చర్: టమాట ధర ఎగసిపడుతోంది. రికార్డు స్థాయి ధరలతో హోరెత్తిస్తోంది. జిల్లా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా గురువారం స్థానిక కక్కలపల్లి మార్కెట్‌లోని ఓ మండీలో ఏకంగా కిలో రూ.133 గరిష్ట ధర పలికి రికార్డు సృష్టించింది. 15 కిలోల టమాట బాక్సు ధర వేలంలో రూ.2 వేలు టాప్‌రేట్ పలికినట్లు మండీ నిర్వాహకులు రమణ తెలిపారు. సరుకు చాలా తక్కువగా వస్తుండటంతో ధర ఎక్కువగా పలుకుతోందని మార్కెటింగ్‌శాఖ సెక్రటరీ రామ్‌ప్రసాద్ తెలిపారు. దేశవ్యాప్తంగా దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ పరిస్థితి ఇలాగే ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మార్చి, ఏప్రిల్, మే నెలల్లో టమాట సాగుకు అనుకూలం లేనందున మార్కెట్‌కు సరుకు తక్కువగా వస్తోంది. ఆగస్టులో ధరలు తగ్గవచ్చని అంచనా.



గురువారం టమాటా మండీలో వేలం దృశ్యం

రైతుకు పట్టాభిషేకం



ఏళ్లుగా సాగుచేస్తున్నా యాజమాన్య హక్కులు లేవు. ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయినా పరిహారం అందదు. కనీసం పంటరుణాలు కూడా మంజూరు కావు. కళ్లెదుట భూమి తప్ప అది తమదీ అని చెప్పుకునేందుకు ఆధారం లేదు. అసైన్డ్ భూములు సాగుచేసుకుంటూ యాజమాన్య హక్కులేక ఇబ్బందులు పడుతున్న ఇలాంటి రైతులు జిల్లాలో వేలాది మంది ఉన్నారు. వారందరికీ 'పట్టా'భిషేకం చేసేందుకు జగన్ సర్కార్ సిద్ధమైంది. ఈ మేరకు బుధవారం జరిగిన కేబినెట్‌లో నిర్ణయం తీసుకుంది.

భూ పంపిణీ కోసం అందిన దరఖాస్తులు, పంపిణీకి సిద్ధం చేసిన భూమి ఇలా..

రెవెన్యూ డివిజన్	రైతుల సంఖ్య	ఎకరాలు
పుట్టపర్తి	2,090	2,618
కదిరి	2,960	4,860
పెనుకొండ	237	272
ధర్మవరం	2,544	5,291
మొత్తం	7,831	13,041

- భూ పంపిణీకి సిద్ధమైన జగన్ సర్కార్
- సాగు రైతులకు పట్టాలిచ్చేందుకు చర్యలు
- జిల్లాలో 7,831 మంది రైతుల దరఖాస్తు
- పంపిణీకి 13 వేల ఎకరాలు సిద్ధం



వెంకటగాలిపల్లి వద్ద సాగుకు సిద్ధం చేసిన భూమి



సాగు భూములను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

పుట్టపర్తి అర్బన్: భూ పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. నిబంధనల మేరకు భూములు సాగు చేస్తున్న రైతులకు పట్టాలివ్వాలని నిర్ణయించింది. ఈమేరకు ఈ నెల 12వ తేదీ జరిగిన కేబినెట్‌లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు.

పారదర్శకంగా పంపిణీ..

ఇప్పటికే భూ పంపిణీకి ప్రక్రియ ప్రారంభించిన అధికారులు రైతుల పొలాలను ఫొటోలు తీసి, జియో ట్యాగింగ్ చేసి, సదరు సర్వే నంబర్లు ఎవరి పేరుమీద ఉన్నాయా లేదా అని పరిశీలించారు. అన్నీ సవ్యంగా ఉన్న భూములనే పంపిణీ జాబితాలో చేర్చారు. ఆరు నెలల క్రితమే గ్రామాల్లో సభలు నిర్వహించి అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. పూర్తి పారదర్శకంగా కుల, మత, రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారులను గుర్తించారు. ఎక్కడా దళారుల ప్రమేయం లేకుండా పగడ్బందీగా పట్టా ఫారం, ఫీల్డ్ స్కెచ్‌తో పాటు పట్టాదార్ పాస్ పుస్తకం అందజేయనున్నారు.

7,831 మంది రైతులకు 13,040 ఎకరాలు..

ఇప్పటివరకూ ప్రభుత్వం ఏడు విడతల్లో 20,544 మంది రైతులకు 34,539 ఎకరాల భూమిని పంపిణీ చేసింది. అయితే త్వరలోనే చేపట్టనున్న భూ పంపిణీ రికార్డుల్లోకి ఎక్కనుంది. గతంలో పోలిస్తే ఈ సారి భారీ స్థాయిలో భూ పంపిణీ చేయనున్నారు. ఈ క్రమంలో శ్రీసత్యసాయి జిల్లా రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచినట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాలోని పుట్టపర్తి, కదిరి, పెనుకొండ, ధర్మవరం, రెవెన్యూ డివిజన్లలో 7,831 మంది రైతులు దరఖాస్తు చేసుకోగా, ప్రభుత్వం 13,040 ఎకరాలకు పట్టాలు అందజేసేందుకు సిద్ధమైంది. ఇప్పటికే గ్రామ సభల ద్వారా స్వీకరించిన దరఖాస్తులను రాష్ట్ర అసైన్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో పరిశీలించి అర్హులను గుర్తించారు. గ్రామాల వారీగా ఫైలును సైతం సిద్ధం చేశారు.

గువ్వలగుట్టపల్లిలో సమస్యకు పరిష్కారం

పుట్టపర్తి మండల పరిధిలోని గువ్వలగుట్టపల్లి గ్రామ రైతుల భూ సమస్య ఏళ్లుగా నలుగుతోంది. గ్రామానికి చెందిన 90 మంది రైతులు 80 ఎకరాలకుపైగా భూమిని తాతల కాలం నుంచీ సాగు చేసుకుంటున్నారు. అయితే గత టీడీపీ ప్రభుత్వం చేపట్టిన భూ పంపిణీలో సదరు భూములకు పెడపల్లి పెద్దతండా, కొత్తచెరువు, పుట్టపర్తికి చెందిన కొంతమంది రైతులకు పట్టాలు ఇచ్చారు. వాటితో పట్టాదార్ పాస్ పుస్తకాలను పొందిన వారు బ్యాంకుల ద్వారా రుణాలు, ప్రభుత్వ సాయం, ప్రోత్సాహకాలు పొందారు. దీంతో ఈ భూములను సాగుచేసుకుంటున్న రైతులు ఇబ్బందులు పడుతున్నారు. బాధిత రైతులు సమస్యను గతంలోనే ఆర్డీఓ దృష్టికి తీసుకువెళ్లి కొంతకాలం పోరాడారు. దీంతో అధికారులు సదరు ఇతరులకు ఇచ్చిన పట్టాలను రద్దు చేశారు. తాజాగా ఈ భూమిని సాగులో ఉన్న రైతులకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. అలాగే ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సహకారంతో పలువురు రైతులు తమకు న్యాయం జరిగేలా చూడాలని కలెక్టరు, మంత్రులకు వినతిపత్రాలు సమర్పించారు. దీంతో ఈసారి భూ పంపిణీలో వారికి న్యాయం జరగనుంది.

వివరాలు సేకరించారు



నేను, నాతోపాటు మా గ్రామ రైతులు చాలా మందిమి దశాబ్దాలుగా అసైన్డ్ భూములు సాగు చేసుకుంటున్నాం. వాటికి పట్టాలిస్తే యాజమాన్య హక్కులు లభిస్తాయి. ప్రభుత్వ సాయమూ అందుతుంది. గతంలో అధికారులు చేసిన తప్పిదం వల్ల సాగులోలేని రైతులు పట్టాలు పొందారు. తాజాగా సీఎం జగన్ ఆదేశాలతో అధికారులు భూముల వివరాలు, సాగుదారుల వివరాలు సేకరించారు.

– లక్ష్మీనారాయణ, రైతు, గువ్వలగుట్టపల్లి, పుట్టపర్తి మండలం

ఏళ్లుగా నిరీక్షిస్తున్నాం



నేను ఏళ్లుగా 2.29 ఎకరాల భూమి అసైన్డ్ భూమి సాగు చేసుకుంటున్నా. పట్టా కోసం చాలా కాలం నుంచి నిరీక్షిస్తున్నా. ఈ సారి భూ పంపిణీలో కచ్చితంగా పట్టా ఇస్తామని అధికారులు చెప్పారు. భూమిని కూడా పరిశీలించారు. ఇప్పటి వరకూ ఏ ప్రభుత్వం మా సమస్యను తీర్చలేదు. పట్టాల పంపిణీకి చర్యలు తీసుకున్న సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం.

– బొగ్గుల కిష్టప్ప, రైతు, గువ్వలగుట్టపల్లి, పుట్టపర్తి

అనుమతులు రాగానే భూ పంపిణీ



భూ పంపిణీకి సర్వం సిద్ధం చేశాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతానికి భూములు సాగు చేస్తున్న రైతులకు మాత్రమే భూ పంపిణీ చేస్తున్నాం. భూపంపిణీ సమయానికి ఆ భూమిలో పంటలు సాగులో ఉండాలి. అలాంటి రైతులకు తప్పకుండా న్యాయం జరుగుతుంది.

– టీఎస్ చేతన్, జాయింట్ కలెక్టర్

నేడు పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధిపై కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం జరగనుంది. శుక్రవారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అధ్యక్షత వహించనున్న సమావేశానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరాం, కలెక్టర్ అరుణ్‌బాబు, ఇతర అధికారులు హాజరుకానున్నారు.

భోజనం నాణ్యతపై కలెక్టర్ ఆగ్రహం



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: మండల పరిధిలోని పెడపల్లి ఉన్నత పాఠశాల, మామిళ్లకుంట క్రాస్‌లోని ప్రాథమిక పాఠశాలలను కలెక్టర్ అరుణ్ బాబు పరిశీలించారు. పాఠశాలలకు వెళ్లగానే నేరుగా మధ్యాహ్న భోజనం వద్దకే వెళ్లారు. పెడపల్లిలో మెనూ ప్రకారం చిత్రాన్నం, టమాట చట్నీ, ఉడికించిన కోడిగుడ్డు ఇవ్వాలి. భోజనం నాణ్యంగా లేకపోవడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి ఇలాంటి పొరపాటు చేయకుండా చూసుకోవాలని హెచ్‌ఎం రామచంద్రారెడ్డికి ఆదేశించారు. మధ్యాహ్న భోజనంతో పాటు పాఠశాల గదులు, మౌలిక వసతులు, మరుగుదొడ్లు పరిశీలించారు. తర్వాత అక్కడి నుండి మామిళ్లకుంట క్రాస్‌లోని ప్రాథమిక పాఠశాలకు వెళ్లారు. అక్కడ ఇటీవల నాడు–నేడు కింద మంజూరైన పనులను పరిశీలించారు. మరుగుదొడ్లు శుభ్రంగా లేకపోవడం, ఆవరణ అంతా మట్టి ఉండటంతో ఉపాధ్యాయులను మందలించారు. త్వరగా పనులు పూర్తి చేయించి శుభ్రపరచాలన్నారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులతో పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు.

డీఐజీ ఆకస్మిక తనిఖీ

కనగానపల్లి: అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి గురువారం సాయంత్రం కనగానపల్లి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించడంతో పాటు స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. రామగిరి సీఐ చిన్నగౌస్, ఎస్‌ఐ హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెరిగేలా కృషి

హిందూపురం టౌన్: చిరుధాన్యాల విస్తీర్ణం పెరిగేలా వ్యవసాయ అధికారులు, ఆర్‌బీకే సిబ్బంది కృషి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు అన్నారు. గురువారం స్థానిక సహాయ వ్యవసాయ సంచాకుల కార్యాలయంలో ఏడీ అల్తాఫ్ అలీ ఖాన్‌తో కలిసి మండల వ్యవసాయధికారులు, ఏఈఓలు, రైతు భరోసా కేంద్ర సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాల విస్తీర్ణంలో ముఖ్యంగా రాగి పంట విస్తీర్ణం సాగు పెంచేలా అధికారులు దృష్టి పెట్టాలన్నారు. రైతులకు పంటలపై అవగాహన కల్పించడంలో ఆర్‌బీకే సిబ్బంది కీలక పాత్ర వహించాలన్నారు. అనంతరం పట్టణంలో నూతనంగా నిర్మించిన పురుగు మందులు, ఎరువులకు సంబంధించిన ల్యాబ్‌ను ఆయన పరిశీలించారు. సమావేశంలో ఏఓలు సురేంద్రనాయక్, లలిత, విజయభారతి, వంశీకృష్ణ, ల్యాబ్ అధికారి చైతన్య పాల్గొన్నారు.

ఇద్దరిపై క్రిమినల్ కేసులు

సాక్షి ఎఫెక్ట్..

రాప్తాడురూరల్: సమగ్ర శిక్ష కార్యాలయంలో ఈఈ, డీఈ పేర్లతో లాగిన్లు ప్రారంభించి సాగించిన సబ్సిడీ సిమెంట్ దందా వ్యవహారంలో ఇద్దరి ఉద్యోగులపై అనంతపురం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేశారు. దాదాపు 70 లోడ్ల సిమెంట్‌ను బ్లాక్‌మార్కెట్‌కు తరలించిన ఘటనపై 'సాక్షి'లో కథనాలు రావడంతో అనంతపురం, శ్రీసత్యసాయి కలెక్టర్లు గౌతమి, అరుణ్‌బాబు సీరియస్‌గా పరిగణించారు. తాత్కాలికంగా ఇద్దరు ఉద్యోగులను తప్పిస్తూ క్రిమినల్ కేసులు నమోదు చేయించాలని ఆదేశించారు. రెండు వారాలవుతున్నా కేసు నమోదు కాలేదు...ఇద్దరు ఉద్యోగులను విధుల నుంచి తప్పించలేదు. ఈ క్రమంలో బుధవారం 'సాక్షి'లో 'కేసు నమోదులో తాత్సారం' శీర్షికతో కథనం వెలువడింది. స్పందించిన అధికారులు ఆగమేఘాలపై అదే రోజు కంప్యూటర్ ఆపరేటర్, అటెండర్‌ను విధుల నుంచి తప్పించారు. అలాగే వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు కూడా నమోదు చేశారు. 420, 406 రెడ్‌విత్ 34 ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు సీఐ రెడ్డప్ప తెలిపారు. సమగ్ర వివరాలన్నీ పోలీసుల దర్యాప్తులో బయటకు రానున్నాయి.

ఐసీడీఎస్ పీడీలకు నోటీసులు

అనంతపురం సెంట్రల్: అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ఐసీడీఎస్ పీడీలు శ్రీదేవి, లక్ష్మీకుమారీలకు మహిళా, శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ విజయ సునీత నోటీసులు జారీ చేశారు. నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ భవనాల నిర్మాణంలో ఎందుకు వెనుకబడ్డారో మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు. లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతపురం జిల్లాలో 91 భవనాలు మంజూరు కాగా 73 బేస్‌మెంట్, సత్యసాయి జిల్లాలో 61 భవనాలు మంజూరు కాగా బేస్‌మెంట్ లెవల్‌లోనే 49 ఉన్నాయి. రెండు జిల్లాల్లో ఒక్కటి కూడా పూర్తి దశకు రాలేదు.

ఇం'ధనం' పక్కదారి !

- కర్ణాటక నుంచి నిత్యం డీజిల్ అక్రమ రవాణా
- నకిలీ బిల్లులతో పన్ను చెల్లించకుండా తరలింపు
- అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ ఖజానాకు భారీ గండి
- పోలీసులపైనే కేసులకు సిద్ధమైన డీజిల్ ట్యాంకర్ల డ్రైవర్లు



ఇది కర్ణాటక నుంచి అక్రమంగా ఆరు వేల లీటర్ల డీజిల్ తరలిస్తున్న ట్యాంకర్. గతేడాది డిసెంబరు 20న పెనుకొండలోని కియా పోలీసులు పట్టుకున్నారు. హిందూపురం వాణిజ్య పన్నుల శాఖాధికారులకు అప్పగించారు. పావగడలో ట్యాంకర్ నింపినట్లు డ్రైవర్ బిల్లులు చూపించాడు. అయితే బెంగళూరు వెళ్లాల్సి ఉండగా.. ఇంజిన్ రిపేరీకి రావడంతో అనంతపురం వెళ్తున్నట్లు డ్రైవర్ డ్రామా చేశాడు. పోలీసులను బెదిరించే క్రమంలో ఎస్‌ఐ తనను కాలితో తన్నాడని డ్రైవర్ ఫిర్యాదు చేశాడు. దీనిపై ప్రైవేటు కేసు కూడా నమోదైంది. వివరాలను ఆరా తీయగా.. ధర్మవరం మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ (వరదాపురం సూరి)కి చెందిన నితిన్‌సాయి కన్‌స్ట్రక్షన్ వాహనంగా తేలింది.

సాక్షి, పుట్టపర్తి: అదును దొరికితే చాలు అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. కాసుల కోసం నిబంధనలను తుంగలో తొక్కేస్తున్నారు. ఇటీవలి కాలంలో కొత్త పంథాలో డీజిల్ దందాకు తెరదీశారు. ఎలాంటి సుంకం చెల్లించకుండా కర్ణాటక నుంచి జిల్లాకు తీసుకొస్తూ జేబులు నింపుకుంటున్నారు. నకిలీ బిల్లులు చూపిస్తూ ట్యాంకర్ల ద్వారా డీజిల్‌ను నిత్యం తరలిస్తూ ఫలితంగా ప్రభుత్వానికి రూ.కోట్లలో గండి కొడుతున్నారు.

కాంట్రాక్టర్లతో కుమ్మక్కు..

జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులకు మట్టి, కంకర తరలిస్తున్నారు. అయితే అభివృద్ధి చేస్తున్నది ఒకరు.. దందా చేస్తున్నది మరొకరు. కొందరు నాయకులు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై కాసుల ఆశచూపి కర్ణాటక నుంచి ఇంధనం అక్రమంగా తీసుకొస్తున్నారు. పనులకు ఉపయోగించే వాహనాలకు మొత్తం అక్రమంగా తీసుకొచ్చిన డీజిల్‌నే ఉపయోగిస్తున్నట్లు సమాచారం. డీజిల్ దందా వ్యవహారంలో పోలీసులకు మామూళ్లు ముడుతుండటంతో వారు కూడా మౌనంగా ఉన్నారనే ఆరోపణలు ఉన్నాయి.

భారీగా దిగుమతి..

మన రాష్ట్రం కంటే కర్ణాటకలో డీజిల్ ధర తక్కువగా ఉంది. ఎక్సైజ్ సుంకం కారణంగా వ్యత్యాసం వచ్చింది. అయితే అక్కడి నుంచి మన రాష్ట్రానికి డీజిల్ తేవాలంటే తప్పనిసరిగా పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఆ విధంగా పన్ను చెల్లిస్తే.. ఇక్కడ ఉన్న ధరలకు సమానం అవుతుంది. ఈ క్రమంలో కొందరు అక్రమార్కులు నకిలీ బిల్లులు సృష్టించి రోజూ వేలాది లీటర్ల డీజిల్‌ను జిల్లాకు తీసుకొస్తున్నారు. ఒక్కో ట్యాంకర్ సుమారు పది వేల లీటర్ల వరకు డీజిల్ తీసుకొస్తున్నాయి. దొడ్డి దారిన పోలీసులకు దొరక్కుండా జిల్లాలో చొరబడుతున్నారు. ఇందులో అధికారుల అలసత్వం కూడా అక్రమార్కులకు కలిసి వచ్చినట్లు చెప్పవచ్చు.

లోపించిన నిఘా..

వాణిజ్య పన్నులు, పోలీసుశాఖ అధికారులు తూతూ మంత్రంగా తనిఖీలు చేస్తున్నారు. ఫలితంగా వారి కళ్లు కప్పడం అక్రమార్కులకు పెద్ద పనేమీ కాకుండా పోయింది. నిబంధనల ప్రకారం 10 వేల లీటర్లు అక్రమంగా తీసుకొస్తూ పట్టుబడితే రూ.2 లక్షల వరకు జరిమానా విధించాల్సి ఉంటుంది. కానీ కొందరు అధికారులు కుమ్మక్కై జేబులు నింపుకొని కేసులు నమోదు చేయకుండా వదిలిపెడుతున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. పెనుకొండ మీదుగా డీజిల్ దందా కొనసాగుతోందని చెబుతున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి రూ.కోట్లలో గండి పడుతోంది.

తనిఖీలు ముమ్మరం చేస్తాం



డీజిల్ స్మగ్లింగ్‌ను అరికట్టడంపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తాం. సరిహద్దు ప్రాంతాల్లో అధిక బలగాలను కేటాయిస్తాం. వాణిజ్య పన్నుల శాఖతో కలిసి దాడులు చేసే విషయాన్ని కూడా పరిశీలిస్తాం. అక్రమార్కులపై చట్టరీత్యా కఠినంగా వ్యవహరిస్తాం. పోలీసుశాఖలో ఎవరైనా అక్రమాలకు పాల్పడినట్లు తేలితే చర్యలు తీసుకుంటాం.

– ఎస్‌వీ మాధవ్‌రెడ్డి, ఎస్పీ

‘క్యాంపస్’లో కోర్సుల కోత

- బీటెక్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అమలుకు నిరాకరణ
- ఎంటెక్‌లో బ్రిడ్జి ఇంజినీరింగ్ కోర్సుకు మాత్రమే అనుమతి
- ఈ విద్యా సంవత్సరం నుంచి ఎంటెక్‌లో పది కోర్సులు


జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల

అనంతపురం: మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక విద్య కొత్త పుంతలు తొక్కుతోంది. ప్రపంచీకరణ నేపథ్యంలో కంపెనీ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యం కలిగిన మానవ వనరుల ఉత్పాదన అనివార్యమైంది. దీంతో మార్కెట్ అవసరాలకు దీటుగా ఉండే కొత్త కోర్సుల అభ్యాసన తప్పనిసరిగా మారింది. ఈ నేపథ్యంలో బీటెక్ కోర్సుల్లోనూ సమూల మార్పులు వస్తున్నాయి. ఇప్పటికే పలు ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలు సరికొత్త కోర్సులు అమలు చేస్తూ విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి. అయితే 77 ఏళ్ల ఘన చరిత కలిగిన జేఎన్‌టీయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో కొత్త కోర్సుల అమలుకు నిరాకరణ ఎదురవుతోంది. ప్రతిభావంతులైన విద్యార్థులు చదువుకునే క్యాంపస్ కళాశాలలో కొత్త కోర్సులు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థుల్లో నిరాశ వ్యక్తమవుతోంది.

బీటెక్‌లో ఏఐ అండ్ ఎంఎల్ కోర్సు లేనట్లే..

జేఎన్‌టీయూ (అనంతపురం) క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇప్పటి వరకూ మెకానికల్, సివిల్, కంప్యూటర్ సైన్సెస్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కెమికల్ కోర్సులు ఉన్నాయి. వీటికి తోడు 2022–23 విద్యా సంవత్సరంలో బీటెక్‌లో కంప్యూటర్ సైన్సెస్ విభాగంలో మెషిన్ లెర్నింగ్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సును ప్రవేశపెట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందుకు ఏఐసీటీఈ నుంచి అనుమతి కూడా తీసుకున్నారు. అయితే కొత్త కోర్సు అనుమతికి గత పాలకమండలి సమావేశంలో ఆమోదం దక్కలేదు. నూతన కోర్సుల అమలుకు పాలకమండలి ఆసక్తి కనబరచక పోవడంతో గతంలో ఉండే ఆరు బ్రాంచుల్లోనే ఈ ఏడాది ఇంజినీరింగ్ అడ్మిషన్లు చేపట్టనున్నారు. ఫలితంగా ప్రతిభావంతులైన విద్యార్థులు ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో చేరాల్సిన అనివార్యమైన పరిస్థితులు ఏర్పడ్డాయి.

ఎంటెక్‌లోనూ కోతే!

జేఎన్‌టీయూ (ఏ) ఇంజినీరింగ్ కళాశాలలో ఎంటెక్ కోర్సుల్లో ఇప్పటి వరకూ 24 బ్రాంచులుండేవి. 2022–23 విద్యా సంవత్సరం నుంచి వీటిని కేవలం 10 బ్రాంచ్‌లకే పరిమితం చేశారు. ప్రస్తుతం స్ట్రక్చరల్ ఇంజినీరింగ్, పవర్ సిస్టమ్స్, పవర్ అండ్ ఇండస్ట్రియల్ డ్రైవ్, రెఫ్రిజిరేటర్ అండ్ ఎయిర్ కండీషనల్, డిజిటల్, ఎలక్ట్రికల్ అండ్ సిస్టమ్స్, కంప్యూటర్ సైన్సెస్, నానో టెక్నాలజీ, వీఎల్ఎస్ఐ అండ్ డిజైన్ కోర్సులతో పాటు తాజాగా సివిల్ ఇంజినీరింగ్‌లో బ్రిడ్జ్ టెక్నాలజీ (బ్రిడ్జి అండ్ టన్నెల్) బ్రాంచ్‌ను అదనంగా ప్రవేశపెట్టారు. మిగిలిన 14 బ్రాంచ్‌లకు కోత పెట్టారు.

అవకాశం దక్కితేనే ఉపాధి..

అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి పొందిన జేఎన్‌టీయూ (ఏ) ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తి చేయాలనే ఆకాంక్ష ఎంతో మంది విద్యార్థులకుంది. ఈ క్రమంలో అదనంగా బీటెక్‌లో బ్రాంచ్ ఏర్పడితే విద్యార్థులకు గొప్ప సదావకాశంగా ఉంటుంది. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కెమికల్, కంప్యూటర్ సైన్సెస్ విభాగంలో మొత్తం 360 ఇంజినీరింగ్ సీట్లు ఉన్నాయి. తాజాగా కొత్త బ్రాంచ్ ఏర్పడితో మరో 60 సీట్లు అందుబాటులోకి వస్తాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సుకు తాజాగా భారీ డిమాండ్ ఉంది. ఈ కోర్సును అందుబాటులోకి తెస్తే ఉమ్మడి అనంతపురం జిల్లా విద్యార్థులకు గొప్ప వరంగా మారుతుంది.

జేఎన్‌టీయూ(ఏ)లో సీటుకు భారీ డిమాండ్ ..

ఎంసెట్‌లో గణనీయమైన ర్యాంకులు దక్కిన వారికే జేఎన్‌టీయూ (ఏ) క్యాంపస్ కళాశాలలో సీటు దక్కే పరిస్థితి ఉంది. ఈ కళాశాలలో ఇంజినీరింగ్ అడ్మిషన్లకు భారీ డిమాండ్ ఉంది. ఈ క్రమంలో సెట్‌లో అత్యుత్తమ ర్యాంకు సాధించిన విద్యార్థులు మొదటి ఆప్షన్ కింద జేఎన్‌టీయూ(ఏ) క్యాంపస్ కళాశాలనే ఎంపిక చేసుకుంటున్నారు. దీంతో ఏటా అత్యుత్తమ ర్యాంకర్లకే ఈ కళాశాలలో సీట్లు దక్కుతున్నాయి. క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా ఏటా పేరెన్నికగల బహుళజాతి సంస్థల్లో 300 మందికి పైగా కొలువులు దక్కించుకుంటున్నారు. దీంతో ఈ కళాశాలలో సీటు హాటుకేక్‌గా మారింది. ఈ నేపథ్యంలో జేఎన్‌టీయూ(ఏ) ఉన్నతాధికారులు పునరాలోచించి బీటెక్‌లో అదనపు బ్రాంచ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

ప్రతిపాదనను పరిశీలిస్తాం

జేఎన్‌టీయూ అనంతపురం క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో కొత్తగా బీటెక్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ కోర్సు ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదన ఉంది. ఈ ప్రతిపాదనను మరోసారి పరిశీలిస్తాం. ఈ విద్యా సంవత్సరం నుంచి ఎంటెక్‌లో బ్రిడ్జ్ టెక్నాలజీ కోర్సును అందుబాటులోకి తీసుకువచ్చాం.
– ఆచార్య జింకా రంగజనార్దన, వీసీ, జేఎన్‌టీయూ(ఏ)

క్లుప్తంగా

ధరల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం


మంత్రి నాగేశ్వరరావును సన్మానిస్తున్న బైసాని రాంప్రసాద్

హిందూపురం అర్బన్: ధరల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటోందని జిల్లా వాణిజ్య పరిశ్రమల మండలి అధ్యక్షుడు బైసాని రాంప్రసాద్ తెలిపారు. నిత్యావసరాలు, కూరగాయల ధరల నియంత్రణపై విజయవాడలో వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, పౌరసరఫరాల శాఖ మంత్రి కె.నాగేశ్వరరావు, సంస్థ ఎండీ వీరపాండియన్‌తో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బైసాని హాజరయ్యారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను హిందూపురం ‘సాక్షి’కి ఆయన ఫోన్ ద్వారా వివరించారు. విత్తనాలు, అవసరమైన నిత్యావసర సరుకుల ధరలు నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్లు తెలిపారు. డిమాండ్‌కు తగ్గ సరుకులు, కూరగాయలను పొరుగు రాష్ట్రాల నుంచి కొనుగోలు చేసి, సరసమైన ధరకు ప్రజలకు అందించేందుకు సిద్ధమైనట్లు తెలిపారు. త్వరలో వినియోగదారులకు అత్యవసర సరకులు నిర్ణీత ధరకు అందనున్నాయన్నారు.

యువకుడి బలవన్మరణం

హిందూపురం అర్బన్: కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్తాపం చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... లేపాక్షి మండలం కల్లూరుకు చెందిన మధు (26) హిందూపురం సమీపంలోని సుబ్బిరెడ్డిపల్లిలో నివాసముంటూ టైల్స్ పరిచే పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో తనకు పరిచయమైన కర్ణాటక ప్రాంతానికి చెందిన ఓ మహిళతో సహజీవనం సాగిస్తూ వచ్చాడు. బుధవారం ఆమెతో గొడవపడి మద్యం మత్తులో ఇంటికి చేరుకున్న మధు జరిగిన విషయాన్ని మొత్తం తల్లితో చెప్పి బాధపడ్డాడు. దీంతో కుమారుడికి ఆమె సర్దిచెప్పి ఆ రోజు ఇంటి పట్టునే ఉండిపొమ్మని చెప్పింది. గురువారం వేకువజామున మధు కోసం ఇంటికి వచ్చిన తమ్ముడు లోపలకు వెళ్లి చూడగా ఉరికి విగతజీవిగా వేలాడుతూ కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించాడు. హిందూపురం రూరల్ ఏఎస్ఐ సురేష్... ఆ గ్రామానికి చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

మున్సిపల్ వైస్ చైర్మన్లుగా జయరామిరెడ్డి, షంషాద్‌బేగం

- ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయండి : ఎమ్మెల్యే కేతిరెడ్డి


వేముల జయరామిరెడ్డిని అభినందిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి (చిత్రంలో) షంషాద్ బేగం

ధర్మవరం: ధర్మవరం మున్సిపల్ వైస్ చైర్మన్లుగా వేముల జయరామిరెడ్డి, షంషాద్‌బేగం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో గురువారం వైస్ చైర్మన్ల ఎన్నికలను ప్రిసైడింగ్ ఆఫీసర్ హోదాలో ఆర్డీఓ తిప్పేనాయక్ చేపట్టారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి పాల్గొన్నారు. మొదటి వైస్ చైర్మన్‌గా 2వవార్డు కౌన్సిలర్ వేముల జయరామిరెడ్డిని 3వ వార్డు కౌన్సిలర్ శంకర్ తేజేశ్వర్ ప్రతిపాదించగా 14వ వార్డు కౌన్సిలర్ గుజ్జల శివ బలపరిచారు. రెండో మున్సిపల్ వైస్ చైర్మన్‌గా 38వ వార్డు కౌన్సిలర్ షేక్ షంషాద్ బేగంను 11వ వార్డు కౌన్సిలర్ అత్తర్ జిలాన్‌బాషా ప్రతిపాదించగా 9వ వార్డు కౌన్సిలర్ మాసపల్లి సాయికుమార్ బలపరచడంతో ఇద్దరి ఎంపిక లాంఛనమైంది. వారితో పీఓ తిప్పేనాయక్ ప్రమాణ స్వీకారం చేయించిన అనంతరం ఎమ్మెల్యే కేతిరెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా నూతన వైస్ చైర్మన్లు మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో పదవులు అప్పగించిన ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, ఈఈ సత్యనారాయణ, డీఈ వన్నూరుస్వామి, ఆర్ఓ ఆనంద్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డిని భారీ గజమాలతో వైఎస్సార్‌సీపీ అభిమానులు సత్కరించారు.

వందశాతం ఫీజు వసూలే లక్ష్యం

- మార్కెటింగ్ శాఖ ఆర్జేడీ రామాంజనేయులు ఆదేశం


సమీక్షకు హాజరైన ఆర్జేడీ రామాంజనేయులు, డీడీఎం శ్రీకాంత్‌రెడ్డి

అనంతపురం అగ్రికల్చర్: ఈ ఏడాది వంద శాతం ఫీజు వసూలు లక్ష్యాలు సాధించాలని ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలోని 17 మార్కెట్ కమిటీల అధికారులను మార్కెటింగ్ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) రామాంజనేయులు ఆదేశించారు. డీడీఎం శ్రీకాంత్‌రెడ్డి, ఏడీఎంలు పి.సత్యనారాయణ చౌదరి, మూర్తితో కలసి గురువారం స్థానిక ఏడీఎం కార్యాలయంలో రెండు జిల్లాల మార్కెట్ కమిటీల సెక్రటరీలు, సూపర్‌వైజర్లతో ఫీజు వసూలు అంశంపై ఆయన సమీక్షించారు. మొదటి మూడు నెలల కాలంలో 10 మార్కెట్‌యార్డుల పరిస్థితి ఆశాజనకంగా ఉన్నా... మిగిలిన ఏడింటిలో వసూళ్ల లక్ష్యం బాగా తగ్గిందన్నారు. అనంతపురం జిల్లాలో ఉన్న 9 కమిటీల ద్వారా రూ.10.81 కోట్ల వార్షిక లక్ష్యానికి గానూ రూ.2.86 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లాలో 7 కమిటీల ద్వారా రూ.4.72 కోట్లకు గానూ రూ. 1.22 కోట్లు వసూలైందన్నారు. గతేడాది మాదిరిగానే అన్ని కమిటీలు లక్ష్యానికి మించి వసూలయ్యేలా విజిలెన్స్ చర్యలు పటిష్టం చేయాలని ఆదేశించారు. రైతులకు సేవలందిస్తూనే యార్డుల అభివృద్ధికి ఆదాయమార్గాలు అన్వేషించాలన్నారు. చెక్‌పోస్టుల ద్వారా వసూళ్లు పెరగాలన్నారు. చీనీ, చింత, ఎండుమిరప, పశువులు, జీవాల సంతలో పారదర్శకతకు పెద్దపీట వేయాలన్నారు. అంతకు ముందు అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో చీనీ క్రయ విక్రయాలపై వ్యాపారులు, రైతులు, అధికారులతో మాట్లాడారు.

జగనన్నతోనే వాల్మీకుల అభ్యున్నతి

- వాల్మీకి బోయ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర


రామచంద్రను అభినందిస్తున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ

పెనుకొండ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే వాల్మీకులకు అభ్యున్నతి సాధ్యమైందని రాష్ట్ర వాల్మీకి బోయ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర అన్నారు. చైర్మన్‌గా నియమితులైన ఆయన గురువారం సాయంత్రం ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణను ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి తన ఎంపికకు కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రామచంద్రను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించారు. జెడ్పీటీసీ సభ్యుడు గుట్టూరు శ్రీరాములు, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాగలూరు బాబు, ముఖ్య నాయకులు రామ్మోహన్‌రెడ్డి, పాదయాత్ర నటేష్, చిన్నపరెడ్డిపల్లి రాము తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు పలువురు వాల్మీకి, బీసీ సంఘాల నాయకులు, సన్నిహితులు అమ్మవారుపల్లిలోని ఆయన స్వగృహంలో కలసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ...వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు సీఎం వైఎస్ జగన్ చొరవ చూపిస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే మంత్రి వర్గం ఆమోద ముద్ర వేసిన ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వానికి పంపారని గుర్తు చేశారు. తన ఎంపికకు కృషి చేసిన ఎమ్మెల్యే శంకరనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ, ఎమ్మెల్యేలు, ఇతర నాయకులకు రుణపడి ఉంటానన్నారు.

వారం తర్వాత మళ్లీ కలుద్దాం

- బాబును కలిసిన గుండుమల, ఈరన్న
- మళ్లీ కలుద్దామంటూ వెనక్కు పంపిన అధినేత

మడకశిర: మడకశిర తెలుగు తమ్ముళ్ల పంచాయితీ ఎటూ తెగలేదు. హైకమాండ్ పిలిచినప్పుడు వెళ్లడం .. సమస్యకు పరిష్కారం దక్కకుండానే వెనుదిరగడం షరా మామూలైంది. మరోసారి హైకమాండ్ పిలుపుతో మాజీ ఎమ్మెల్యే ఈరన్న, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి వర్గాల నాయకులు గురువారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ రెండు వర్గాల మధ్య రాజీ కుదర్చడానికి హైకమాండ్ వారిని రమ్మంది. తొలుత ఈరన్న, గుండుమల తిప్పేస్వామితో పార్టీ పరిశీలకులు వేర్వేరుగా సమావేశమయ్యారు. వారి నుంచి విడివిడిగా అభిప్రాయాలు సేకరించారు. పరస్పరం ఇరువర్గాల నాయకులు ఫిర్యాదు చేసుకున్నారు. గుండుమల తిప్పేస్వామికి నియోజకవర్గంలో పెద్ద ఎత్తున ప్రజా వ్యతిరేకత ఉందని, క్వారీల ద్వారా పెద్ద ఎత్తున అక్రమార్జన చేశారని, అవినీతి పరుడిగా ముద్ర వేసుకున్నారని, ఆయన తీరుతో పార్టీ ప్రతిష్ట దెబ్బతింటోందని ఈరన్న ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఆయన చెప్పిన వారికి టికెట్ ఇస్తే పార్టీ ఓడిపోవడం ఖాయమని స్పష్టం చేసినట్లు సమాచారం. అదే స్థాయిలో ఈరన్నపై కూడా గుండుమల తిప్పేస్వామి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. వీరద్దరి అభిప్రాయాలను సేకరించి చంద్రబాబు దృష్టికి పార్టీ పరిశీలకులు తీసుకెళితే.. రాత్రి 8.30 గంటలకు వారితో బాబు సమావేశమైనట్లు తెలిసింది. అయితే ఎటూ తేల్చకుండానే మళ్లీ వారం తర్వాత కలుద్దామంటూ వారిని బాబు వెనక్కు పంపినట్లు సమాచారం.

డీఫార్మసీ పరీక్షల్లో ‘పురం’ విద్యార్థిని ప్రతిభ


విద్యార్థిని జోహ్రాతో కళాశాల అధ్యాపకులు

హిందూపురం టౌన్: ఇటీవల వెలువడిన డిప్లొమా ఇన్ ఫార్మసీ (డీఫార్మసీ) పరీక్షా ఫలితాల్లో హిందూపురంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థిని ఎస్.ఫాతిముజ్ జోహ్రా ప్రతిభ చాటుకుంది. ఈ నెల 1వ తేదీన విడుదలైన ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఆమెకు 1100 మార్కులకు గాను 1041 మార్కులు వచ్చాయి. దీంతో ఆమె రీవాల్యువేషన్‌కు వెళ్లింది. ఈ ఫలితాలు ఈ నెల 12న అందాయి. అందులో ఆమె 1066 మార్కులు సాధించినట్లుగా వెల్లడైంది. ఇది రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానమని ఆ కళాశాల ప్రిన్సిపాల్ హరీష్‌బాబు తెలిపారు. వరుసగా రెండోసారి రాష్ట్ర స్థాయిలో తమ కళాశాల ఫార్మసీ విభాగం విద్యార్థులు మొదటి స్థానంలో నిలవడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ప్రతిభ చాటుకున్న విద్యార్థినిని అధ్యాపక బృందం అభినందించి మెడల్, ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

రేషన్ బియ్యం పట్టివేత


రేషన్ బియ్యం తరలిస్తున్న లారీ

మడకశిర: మండలం కేంద్రం స్పెషల్‌పార్టీ పోలీసులు గురువారం చేపట్టిన తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న 360 బస్తాల రేషన్ బియ్యం పట్టుబడింది. పావగడ నుంచి తుమకూరుకు రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు గుర్తించారు. లారీతో పాటు బియ్యం బస్తాలను మడకశిర పోలీసులకు అప్పగించారు.

సోమందేపల్లి: స్థానిక వైఎస్సార్ సర్కిల్ వద్ద ఓ మినీ వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు గురువారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నారు. ఓ మినీ వ్యాన్‌లో 2,600 కిలోల బియ్యాన్ని తరలిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు వాహనాన్ని సీజ్ చేసి, బియ్యాన్ని స్వాధీనం చేసుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. డ్రైవర్ విజయ్‌కుమార్‌రెడ్డిని అరెస్ట్ చేశారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి


నవనీత్ (ఫైల్)

రామగిరి: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఓ విద్యార్థి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. తిమ్మాపురం గ్రామానికి చెందిన నాగరాజు, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు నవనీత్(10) నార్పలలోని గురుకుల పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశానికి అర్హత సాధించాడు. దీంతో బుధవారం ఉదయం తండ్రితో కలసి ద్విచక్ర వాహనంపై నార్పలకు వెళ్లాడు. కౌన్సిలింగ్ ప్రక్రియ ముగించుకుని రాత్రికి తిరుగు ప్రయాణమైన వారు కుంటిమద్ది వద్దకు చేరుకోగానే వర్షం మొదలైంది. దీంతో వాహనాన్ని ఆపి రోడ్డుకు అవతల ఉన్న షెల్టర్ కిందకు చేరుకునేందుకు వెళుతుండగా రామగిరి నుంచి వేగంగా దూసుకొచ్చిన కారు నవనీత్‌ను ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన బాలుడిని స్థానికులు వెంటనే అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక గురువారం మధ్యాహ్నం బాలుడు మృతి చెందాడు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ జనార్దననాయుడు తెలిపారు.

ద్విచక్ర వాహనానికి నిప్పు

అమడగూరు: కుటుంబ కలహాల నేపథ్యంలో తన కంటివారిపల్లిలో ద్విచక్ర వాహనానికి నిప్పు పెట్టారు. ఎస్ఐ వెంకటనారాయణ తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన ధనుంజయ్‌కు ధర్మవరానికి చెందిన అతని అల్లుడు సూర్యనారాయణకు మధ్య విభేదాలున్నాయి. బుధవారం రాత్రి సూర్యనారాయణ తనకంటివారిపల్లికి బైక్‌పై వచ్చాడు. ఈ క్రమంలో అర్ధరాత్రి బైక్‌కు నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలిపోయింది. ధనుంజయపై అనుమానాలు వ్యక్తం చేస్తూ సూర్యనారాయణ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జనావాసాల్లోకి నెమలి



కళ్యాణదుర్గం: స్థానిక మార్కెట్ యార్డు సమీపంలోని ఇంటి ప్రహరీపై గురువారం ఓ నెమలి చూపరులను కనువిందు చేసింది. సాయంత్రం తేలికపాటి వర్షం కురవడంతో సమీపంలోని జనావాసంలోకి నెమలి వచ్చింది.

రికవరీ చేసిన నగదుపై విచారణ

మడకశిర: మండలంలోని బుళ్లసముద్రం సమీపంలో పేకాట ఆడుతూ జిల్లా స్పెషల్ ఆపరేషన్ గ్రూపు పోలీసులకు బుధవారం 17 మంది జూదరులు పట్టుబడిన విషయం తెలిసిందే. ఘటనకు సంబంధించి 20 సెల్‌ఫోన్లు, 13 ద్విచక్ర వాహనాలతో పాటు పెద్ద మొత్తంలో నగదు స్వాధీనం చేసుకున్నట్లు వదంతులు వ్యాపించాయి. అయితే పోలీసులు మాత్రం రూ.1,49,060 మాత్రమే ఎఫ్ఆర్ఐలో చూపడం అనుమానాలకు తావివ్వడంతో విచారణకు ఉన్నతాధికారులు ఆదేశించారు. అక్రమాలకు తావిచ్చినట్లు బయటపడితే సంబంధిత అధికారిపై చర్యలు తీసుకునే అవకాశమున్నట్లు సమాచారం.

పీఏసీఎస్ చైర్మన్‌గా వైటీ చంద్రశేఖర్‌రెడ్డి



తాడిమర్రి: తాడిమర్రి ప్రాథమిక వ్యవసాయ కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా దాడితోట నివాసి వైటీ చంద్రశేఖర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పీఏసీఎస్ సీఈఓ దామోదర్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి వరకూ సొసైటీ అధ్యక్షుడిగా పని చేసిన చిన్నచిగుళ్లరేవు గ్రామానికి చెందిన అగిలే శంకర్‌రెడ్డి వ్యక్తిగత కారణాలతో మూడు నెలల క్రితం రాజీనామా చేశారు. దీంతో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి సిఫారసు మేరకు వైటీ చంద్రశేఖర్‌రెడ్డిని ఎంపిక చేస్తూ రాష్ట్ర వ్యవసాయ, కో ఆపరేషన్ శాఖ నుంచి ఉత్తర్వులు వెలువరించినట్లు సీఈఓ తెలిపారు. అలాగే సొసైటీ డైరెక్టర్లుగా తాడిమర్రి ఎస్సీ కాలనీకి చెందిన పన్నూరు కృష్ణమూర్తి, పూలఓబయ్యపల్లి గ్రామానికి చెందిన కురుబ ముత్యాలు నియమితులయ్యారు.

వైభవంగా జ్యోతుల ఉత్సవం


విశేష అలంకరణలో దర్శనమిస్తున్న మారెమ్మ దేవత


ఆలయం చుట్టూ జ్యోతులతో ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు

రొళ్ల: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని రొళ్ల మండలం తిరుమలదేవరపల్లిలో వెలసిన గ్రామ దేవత మారెమ్మకు గురువారం జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు. గ్రామ దేవత మూలవిరాట్‌ను అర్చకుడు గంగా జలంతో శుద్ధి చేసి అభిషేకించారు. వెండి, బంగారు ఆభరణాలు, పూలతో అలంకరణ చేశారు. బియ్యం పిండితో చేసిన జ్యోతులను మహిళలు గ్రామ పురవీధుల గుండా ఊరేగింపుగా తీసుకెళ్లి ఆలయం వద్ద ప్రదక్షిణలు చేసి అమ్మవారికి సమర్పించారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని అమ్మవారిని ప్రార్థించారు. రాత్రి ప్రతి ఇంటి ఆవరణలో ముద్దే మారమ్మ ప్రతిమను తయారు చేసి విశేష పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే ఎస్సీ కాలనీలో వెలసిన అట్టిమారెమ్మకు, ఇందిరమ్మ కొత్త కాలనీ సమీపాన జాజగిరి కొండలో వెలసిన ఆదిశక్తి మార్మెకు జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు.

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.